రైతన్నకు ఎరువు గుబులు!



గ్రామాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో టెక్కలి నుంచి ఆటోలో ఎరువులు తరలిస్తున్న దృశ్యం



ప్రైవేట్ డీలర్ల నుంచి కొనుగోలు చేసుకున్న ఎరువులు

- యూరియా కోసం పాట్లు పడుతున్న అన్నదాత
- రైతు సేవా కేంద్రాలు, సొసైటీలకు వచ్చిన ఎరువులు పక్కదారి పడుతున్నాయంటూ ఆరోపణలు

టెక్కలి: రైతన్నకు ఎరువుల గుబులు వెంటాడుతోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తున్నా కావాల్సిన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అరకొరగా వస్తున్న ఎరువులు సైతం కూటమి నాయకులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలను ఉదాహరణగా చెప్పవచ్చు. తమ రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియాను అధికార పార్టీ కార్యకర్తలు ఇష్టానుసారంగా వారికి నచ్చిన విధంగా పంపిణీ చేశారంటూ కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేట రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఆందోళనకు దిగారు. అలాగే తమ రైతు సేవా కేంద్రానికి వచ్చిన యూరియాను అధికార పార్టీ నాయకులు గుట్టు చప్పుడు కాకుండా అనుకూలంగా ఉన్న వారికి పంపిణీ చేశారని.. స్టాకు ఉన్నప్పటికీ తమకు ఇవ్వడం లేదంటూ అయోధ్యపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద రైతులు ఆందోళనకు దిగారు. టెక్కలి నియోజకవర్గంలో ఎరువులు ప్రధానంగా యూరియా అందడం లేదనే విషయానికి ఈ రెండు సంఘటనలు ఒక ఉదాహరణగా చెప్పుకోవాలి. ఖరీఫ్ సీజన్‌లో టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో అత్యధికంగా వెద పద్ధతిలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం యూరియా వరిసాగుకు చాలా అవసరం. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సరిపడా యూరియా, డీఏపీ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

పరిస్థితి ఇలా..

- ఖరీఫ్ సీజన్‌లో టెక్కలి మండలంలో సుమారు 6,763 హెక్టార్లలో వరి సాగుకు రైతులు సిద్ధమయ్యారు. దీనికోసం 845 మెట్రిక్ టన్నుల యూరియా, 847 మెట్రిక్ టన్నుల డీఏపీ, 507 మెట్రిక్ టన్నుల పొటాష్ అవసరమని అధికారులు నివేదిక సమర్పించారు. అయితే ప్రస్తుతానికి 299 మెట్రిక్ టన్నుల యూరియా, 115 మెట్రిక్ టన్నుల డీఏపీ మాత్రమే రైతు సేవా కేంద్రాల్లో సరఫరా చేశారు. ఇందులో అధికార పార్టీ కార్యకర్తలు ఇష్టానుసారంగా పక్కదారి పట్టించేశారనే ఆరోపణలు ఉన్నాయి.
- నందిగాం మండలంలో 7,939 హెక్టార్లకు 992 మెట్రిక్ టన్నుల యూరియా, 992 మెట్రిక్ టన్నుల డీఏపీకి నివేదిక సమర్పించారు. ప్రస్తుతం 500 మెట్రిక్ టన్నుల యూరియా, 317 మెట్రిక్ టన్నుల డీఏపీ సరఫరా చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఇక్కడ కూడా సామాన్య రైతులకు ఎరువులు అందని పరిస్థితి నెలకొంది.
- కోటబొమ్మాళి మండలంలో 6,817 హెక్టార్ల సాగుకు సంబంధించి 852 మెట్రిక్ టన్నుల యూరియా, 852 మెట్రిక్ టన్నుల డీఏపీకు నివేదిక అందజేశారు. అయితే 420 మెట్రిక్ టన్నుల యూరియా, 208 మెట్రిక్ టన్నుల డీఏపీ సరఫరా చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఇక్కడ కూడా అసలైన రైతులకు ఎరువులు చేరలేదు.
- సంతబొమ్మాళి మండలంలో 7,500 హెక్టార్ల సాగుకు 937 మెట్రిక్ టన్నుల యూరియా, 937 మెట్రిక్ టన్నుల డీఏపీ కోసం అధికారులు ప్రతిపాదనలు చేయగా 189 మెట్రిక్ టన్నుల యూరియా, 145 మెట్రిక్ టన్నుల డీఏపీ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎరువులు అందని ద్రాక్షగా మారాయి.
- వీటితో పాటు టెక్కలి మినహా కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో సొసైటీలకు ఎరువులు సరఫరా చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ ఆయా ఎరువుల కొంతమంది అధికార పార్టీ కార్యకర్తల చెంతకు వెళ్లిపోయాయనే విమర్శలు ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నానని ఎరువులు ఇవ్వలేదు



మా గ్రామంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నాననే కారణంతో నాకు ఎరువులు ఇవ్వలేదు. మా రైతు సేవా కేంద్రానికి వచ్చిన ఎరువులను అధికార పార్టీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా దోపిడీ చేసేశారు. ఎంతో మంది రైతులకు ఎరువులు అందని పరిస్థితి నెలకొంది. మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లి ఎరువులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

– ఎస్.నారాయణరాజు, రైతు, కమలనాభపురం, కోటబొమ్మాళి మండలం

ఎరువుల పంపిణీలో దోపిడీ



గ్రామాల్లో ఎరువుల పంపిణీలో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోంది. అధికార పార్టీ కార్యకర్తలు చెప్పిన వారికి లెక్కలేని విధంగా ఎరువుల బస్తాలు ఇస్తున్నారు. సాధారణ, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని తెలిస్తే వారికి ఎరువులు ఇవ్వడానికి ముప్పుతిప్పలు పెడుతున్నారు.

–హెచ్.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, టెక్కలి

సామాన్యలకు ఎరువులు ఇవ్వడం లేదు



గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తల సిఫార్సులు ఉంటే తప్పా సామాన్య రైతులకు ఎరువులు ఇవ్వడం లేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతీ రైతుకు యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు అందజేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. విత్తనాలు, ఎరువుల విషయంలో తీవ్రమైన వివక్షత చూపుతున్నారు.

– కె.రామరాజు, వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు, కోటబొమ్మాళి

క్లుప్తంగా

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించిన దృశ్యం

సోంపేట: ఉప్పరపేట గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. మేళతాళాలు, నృత్యాలతో ఉత్సవ విగ్రహానికి తిరువీధి నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఉప్పరపేటతోపాటు సమీప గ్రామస్తులు పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీనిధి రుణాలు అందజేయాలి



వీవోఏలతో మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

సోంపేట: స్వయంశక్తి సంఘాల సభ్యులకు ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు శ్రీనిధి రుణాలు అందజేయాలని ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. మండలంలోని వీవోఏలు, సీసీలతో స్థానిక మండల మహిళా సమైఖ్య భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. 1377 మంది సభ్యులకు రూ. 13.77 కోట్లు రుణం అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 381 మంది సభ్యులకు రూ. 1.93 కోట్లు అందజేసినట్టు చెప్పారు. రుణం అవసరం ఉన్న సభ్యులను గుర్తించి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేసేవిధంగా సకాలంలో రుణాలు అందజేయాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: అవగాహనా రాహిత్యంతో చాలామంది తల్లిదండ్రులు ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేసేస్తున్నారని.. అది చట్టరీత్యా నేరమని ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. డొంకూరు మత్స్యకార గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 'నారీ శక్తి'కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల్యదశలో వివాహం చేసుకుంటే విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. ఉన్నత చదువులతో ఉన్నతంగా ఎదగాలని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు జి.హేమకుమారీ, సర్పంచ్ బుడ్డ కళ్యాణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడి వితరణ

కంచిలి: పురుషోత్తపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం కంచిలికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు సాహుకారి సోమేశ్వరరావు కవాతు (మార్చ్ ఫాస్ట్) మాస్ డ్రిల్ నిర్వహణ కోసం అవసరమైన డ్రమ్స్‌ను వితరణగా ఇచ్చారు. రూ. ఏడు వేలు విలువ చేసే రెండు డ్రమ్స్‌ను ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శారదకు మంగళవారం అందజేశారు. ఉపాధ్యాయులు నల్లాన రవి, గార సురేష్, కళ్యాణి, అనిల్, సంతోష్ ఉన్నారు.



డ్రమ్స్‌ను అందజేస్తున్న సోమేశ్వరరావు

సొండి కుల సభ్యత్వ నమోదు తప్పనిసరి

కంచిలి: సొండి కుల సభ్యత్వ నమోదు తప్పనిసరిగా చేపట్టాలని రాష్ట్ర సంఘం కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రం కంచిలిలో మండల సంఘం నేతలతో మంగళవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. సభ్యత్వ నమోదు గ్రామ స్థాయిలో బాధ్యతగా తీసుకొని ప్రణాళిక ప్రకారం చేపట్టాలని సూచించారు. కంచిలి సంఘ నేతలు రత్నాల భాస్కరరావు, షావుకారి రామారావు, షావుకారి చిరంజీవి, పాండవ శేఖర్, షావుకారి సంతోష్, లాభాల ఢిల్లీ, సెనాపతి సునీల్ పాల్గొన్నారు.

ఆర్‌వోబీ పనులు పునఃప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులు మంగళవారం పునః ప్రారంభమయ్యాయి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పనులను ప్రారంభించారు.

ఎరువుల కేంద్రం పరిశీలన

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో నిర్వహిస్తున్న మన గ్రోమోర్ ఎరువులు, విత్తనాల కేంద్రాన్ని స్థానిక తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. గొడౌన్‌లోని సరుకులు, ఎమ్మార్పీ, నిల్వలు, అమ్మకాల రిజిస్టర్లు పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి కె.సురేష్, ఆర్‌ఐ క్రిష్ణచంద్ర రౌళో ఉన్నారు.

ఎరువుల పంపిణీ

సోంపేట: వ్యవసాయ శాస్త్రవేత్తల సిఫారుసు మేరకు ఖరీఫ్ వరి పంటలో రసాయన ఎరువులు వాడాలని వ్యవసాయ సహాయ సంచాలకులు భవాని శంకరరావు, తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల వద్ద ఎరువులు పంపిణీని ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, కంచిలి ఏఎంసీ చైర్మన్ మద్దిలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ..



నందిగాం మండల కేంద్రంలో కొలువై ఉన్న నీలమణి దుర్గ (పాతపట్నం అమ్మవారు) అమ్మవారికి శ్రావణ మంగళవారం సందర్భంగా భక్తులు సారె సమర్పించారు. శ్రావణ మాస పూజల్లో భాగంగా చీర, ఆలంకరణ సామగ్రి, సుగంధద్రవ్యాలు, చలివిడి, 21 రకాల మిఠాయిలు, వివిధ రకాల పండ్లను మేళతాళాలు, డప్పువాయిద్యాలతో శంఖధ్వనితో సామూహికంగా ఆలయానికి సుసుకొనివెళ్లి అమ్మవారికి సమర్పించారు. – నందిగాం

మంగళగౌరీ నమోస్తుతే..



కవిటి మండలంలోని లొళ్ల పుట్టుగ కల్యాణ వేంకటేశ్వర ఆలయం, ప్రగడపుట్టుగ రామేశ్వరాలయం, కవిటి కొత్తూరు సీతారామాలయాల్లో శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా మంగళగౌరీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ మహిళలు సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకొని స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. – కవిటి

నాగ పంచమి పూజలు..



నాగ పంచమి పర్వదినం సందర్భంగా మంగళవారం భక్తులు సుబ్రహ్మణ్యం స్వామి, పరమేశ్వరుడితో పాటు నాగ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. పాతటెక్కలి, పలాసలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలతో పాటు బెండి, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లిలోని శివాలయాలకు వేకువజాము నుంచే వెళ్లి ఆరోగ్యం, సంపద, విద్యతో పాటు వివాహాలు కావాలని భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. – వజ్రపుకొత్తూరు రూరల్

సెప్టెంబర్ 13న లోక్‌అదాలత్



కాశీబుగ్గ: మాట్లాడుతున్న జడ్జి మాధురి

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 13వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జడ్జి యు.మాధురి తెలిపారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చూడాలని కోరారు. దీనిపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బి.కె.ఆర్.పట్నాయక్, జాయింట్ సెక్రటరీ, ఏజీపీ పిండి వెంకట్రావు, సీనియర్ న్యాయవాదులు ఎల్.చంద్రశేఖరరావు, కె.రజనీ కుమార్, రవికుమార్, జి.ప్రభాకర్‌రావు, కె.లోకేశ్వరరావు, శ్యామ్ సుందరరావు, ఎర్రన్న, చిట్టిబాబు, అంది రామకృష్ణ, ఏఎస్‌ఐ గణపతి రావు, కోర్టు కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, ధర్మారావు, సూపరింటెండెంట్ కె.కృష్ణ పాల్గొన్నారు.

అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

టెక్కలి రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కోటబొమ్మాళి కోర్టుల సముదాయంలో సెప్టెంబర్ 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎక్కువ కేసుల రాజీకి న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలన్నారు.

బ్యాంకింగ్ రంగంలో అవకాశాలు మెండు

టెక్కలి: భవిష్యత్‌లో బ్యాంకింగ్ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయా రంగానికి అవసరమైన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన పెంచుకోవాలని అమెరికాలోని ఓ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల పూర్వపు విద్యార్థి చాణక్య కశ్యప్ప సూచించారు. మంగళవారం కళాశాలలో ఎంబీఏ విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ రంగంలో అవకాశాలు వాటిలో సాఫ్ట్‌వేర్ అభివృద్ధిపై పలు అంశాలను వివరించారు. అనంతరం కళాశాల యాజమాన్యం కశ్యప్పను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాస్, డీన్ డి.యుగంధర్, కోఆర్డినేటర్ పూజ, రామ్మోహన్ పాల్గొన్నారు.



చాణక్య కశ్యప్పను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



ఇచ్ఛాపురం రూరల్: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సిబ్బంది



కంచిలి: బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన 12 మంది ఉపాధ్యాయులు బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లారు. దీంతో వీరిని మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టీవీ భార్గవి ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు జాడు ప్రకాశరావు, స్కూల్ అసిస్టెంట్లు కురమాన భార్గవి, పద్మనాభం, సత్యమయ్య, రవికుమార్, నాగేశ్వరరావు, కమలయ్య, రాణీగౌడో, సాజన్, బి,కె.బెహెరా, మీనాక్షీ, బృందావతి సత్కారం పొందినవారిలో ఉన్నారు.

- **కంచిలి:** కేసరపడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు భాస్కరరావు, రవీంద్ర, తులసీరావులను సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అలాగే ఉపాధ్యాయుడు కామేష్‌రెడ్డి మొదటి అపాయింట్‌మెంట్‌లోనే ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడంతో అతన్ని కూడా సన్మానించారు. హెచ్‌ఎం కాశీప్రసాద్, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్ణారావు, స్థానిక నేతలు కప్పల యుగంధర్, గౌరిబిడ్డ మన్మథరావు, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, భార్గవి, లక్ష్మి ఉన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: ఉద్దానం రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన ఆలయ పూజారి బూరగాపు రాము కుమార్తె మౌనికకు వివాహం నిశ్చయమైంది. అయితే నిరుపేద కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామంలోని 'నేను నా క్లాస్‌మేట్స్ ఫ్రెండ్స్' గ్రూపునకు చెందిన యువకులు ముందుకొచ్చి రూ. 20,516 సేకరించారు. ఈ మొత్తాన్ని రాముకు మంగళవారం అందజేసి పాప పెళ్లి ఖర్చులకు ఉపయోగించాలని సూచించారు.

సంక్షేమం జాడ లేదు.. అభివృద్ధి కానరాదు!



కవిటి: వరక గ్రామంలో చంద్రబాబు మోసాలతో కూడిన క్యూఆర్‌కోడ్ పత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 10, 12 వార్డులలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పట్టణ పార్టీ అధ్యక్షుడు శిష్టు గోపీ, కౌన్సిలర్లు



వజ్రపుకొత్తూరు రూరల్: చినవంకలో క్యూ ఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు



పలాస: బ్రాహ్మణతర్లాలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు పైల చిట్టి, ఉంగ సాయిక్రిష్ణ, దువ్వాడ రవి తదితరులు



కంచిలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి



సోంపేట: సిరిమామిడిలో మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో క్యూఆర్‌కోడ్ పత్రాలను పంపిణీ చేస్తున్న సమన్వయకర్త పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప తదితరులు



నందిగాం: అన్నాపురంలో చంద్రబాబు మోసాలను తెలియజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు తదితరులు



కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలసలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ



మందస: బుడారిసింగ్‌లో కూటమి సర్కార్ మోసాలను ప్రజలకు వివరిస్తున్న ఎంపీపీ దొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకీరావు, సర్పంచ్ సురేష్ పాణీగ్రాహి తదితరులు



టెక్కలి: అయోధ్యపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు



వజ్రపుకొత్తూరు: పల్లివూరులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశవరావు, నాయకులు మామిడి భాస్కరరావు, మద్దిల హరినారాయణ, దున్న బాలరాజు తదితరులు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం జాడలేదు, అభివృద్ధి కానరాలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించే ప్రక్రియలో భాగంగా 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమాన్ని పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను క్షుణ్ణంగా వివరించారు. నిరుద్యోగభృతి పేరుతో యువతను తప్పుదారి పట్టించారని, అన్నదాత సుఖీభవ అందక రైతులు అవస్థలు పడుతున్నారని, మహిళలకు నెలకు 15 వందల రూపాయలు హామీ గాలిలో కలిసిపోయిన విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని తెలియజేశారు.

– సాక్షి నెట్‌వర్క్

పీ-4 సర్వే వేగవంతం చేయాలి

మందస: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ–4 సర్వేను వేగవంతం చేయాలని పశుసంవర్ధకశాఖ టెక్కలి డీడీ డాక్టర్ సీహెచ్ నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఎస్‌లతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించి పీ–4 సర్వేపై చర్చించారు. అనంతరం మండలంలోని పలు పశువైద్య కేంద్రాలను సందర్శించి లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ పురోగతిని పశువైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో వై.వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో తిరుమల కుమార్, రుషీశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులపై ఒత్తిడి తగదు

కాశీబుగ్గ: పీ–4 సర్వేలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు భాగస్వాములు కావాలని ప్రభుత్వం ఒత్తిడికి గురిచేయడం తగదని పలాస నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కంచరాన చిన్నబాబు అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సంపన్నుల సహకారంతో పేదలను బంగారు కుటుంబాలు చేస్తానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో చెప్పారన్నారు. ఈ ప్రకియను ప్రభుత్వమే చేపట్టాలని, కార్పొరేట్ సంస్థలు, సంపన్నులను దీనిలో భాగం చేయాలని కోరారు. అంతేతప్పా చిరు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి ఆందోళనకు గురి చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.